క్లుప్తంగా

నీటిని నిల్వ ఉంచొద్దు..

వేంసూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని మండల వైద్యాధికారి ఇందు ప్రియంక అన్నారు. గురువారం మండల పరిధిలోని కందుకూరు, లచ్చన్నగూడెం, రాజుగూడెం, రామన్నపాలెం, భీరపల్లి, కుంచపర్తి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి బోడు కాలనీలో గురువారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి.. రోగులకు మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యులు డాక్టర్ అవినాష్ సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎ.పద్మ, కె.మంజుల, అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కారేపల్లి: మండలంలోని భీక్యాతండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం ఎండీ జాకీర్‌బాబా, ఉపాధ్యాయులు సువర్ణలను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీ ఉపాధ్యయులు గ్రామ పెద్దలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిచ్యానాయక్, మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఉప సర్పంచ్ రాజేష్, వీరన్న, రమేష్, బాజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత



చిన్నారులకు నగదు అందజేస్తున్న దాతలు

బోనకల్: మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన నల్లమల కృష్ణరాజు, స్వర్ణ కుమారి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఇటీవల కోదాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుమారులు కౌశిక్(7), కార్తీక్(4)లు అనాథలుగా మిగిలారు. దీంతో గురువారం జాంబవవారసులం గ్రూపు సభ్యులు రూ.1లక్ష నగదును డాక్టర్ ఇసంపల్లి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు శ్రీను, కన్నారావు, కోటేశ్వరరావు, అంబేడ్కర్, నాగేశ్వరరావు, సుదర్శన్, వెంకట్, నరేష్, కిషోర్, రాములు, కర్ణాకర్, సైదులు, రవి, రమేష్ తదితరులున్నారు.

క్రీడాకారుడికి ప్రోత్సాహం



రూ.20 వేల నగదు అందిస్తున్న వెంకటేశ్వరరావు

మధిర: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, కబడ్డీ క్రీడాకారుడు పీట్ల గోపికి ప్రముఖ వ్యాపారి చెరుకూరి వెంకటేశ్వరరావు గురువారం రూ.20 వేల నగదు వితరణగా అందజేశారు. గోపి గత నాలుగు సంవత్సరాల నుంచి కబడ్డీ ఆడుతూ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులు గెలుపొందాడు. అంతేకాకుండా కబడ్డీ టీం కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతనిని ప్రోత్సహించేందుకు పలువురు దాతలు ఆర్థిక సహకారం అందించారు. ప్రస్తుతం హర్యానాలోని నర్వాల్ కబడ్డీ అకాడమీలో శిక్షణ తీసుకునేందుకు నెలకు రూ.8 వేలు చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంది. దీనికోసం దాత చెరుకూరి వెంకటేశ్వరరావు ఈ ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట నరసింహారావు మాట్లాడుతూ దాతల సహకారంతో గోపి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి ఆక్సిజన్ సిలిండర్ వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి కంద్రిక గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సామనూరి సీతారామరాజు, సామనూరి కృష్ణార్జునరాజులు రూ.15వేల విలువ చేసే ఆక్సిజన్ సిలిండర్, సీలింగ్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. గురువారం వాటిని ఆరోగ్య ఉపకేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, హెల్త్ అసిస్టెంట్ దండెం సాయిరెడ్డిలకు అందజేశారు. దాతల వితరణను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆంథోనమ్మ, ఆశ కార్యకర్తలు పార్వతి, సునీత, నాగమణి తదితరులున్నారు.

ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పంతంగి వెంకట్రావు కుటుంబ సభ్యులకు మత్స్యశాఖ సొసైటీ సభ్యులు గురువారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ దూసరి గోపాలరావు, గ్రామపెద్దలు పెద్దవెంకయ్య, చిన్నకృష్ణ, ఆదినారాయణ, గురుమూర్తి, దస్తగిరి, రాములు, వెంకట్రావు, రసూల్, వీరబాబు పాల్గొన్నారు.

పాపం.. పంచాయతీ కార్యదర్శులు

- గ్రామాల్లో అన్ని శాఖల బాధ్యతలు వారిపైనే..
- విధుల భారం.. నిధుల లేమి..
- అప్పులు చేసిమరీ.. పంచాయతీ పనులు
- బదిలీల వివరాల సేకరణతో ఆందోళన
- ఖర్చు పెట్టిన సొమ్ము వస్తదా.. లేదా అని భయం



కల్లూరు: కొర్లగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

కల్లూరురూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశ పెట్టి అమలు చేయాలన్న ముందుగా అధికారులకు గుర్తుచ్చేది గ్రామ కార్యదర్శులు. పంచాయతీరాజ్ శాఖ తరుపున నియమించబడినప్పటికీ సంబంధించిన అన్ని శాఖల పనులు చేయాల్సిన పరిస్థితి పంచాయతీ కార్యదర్శులకు ఏర్పడింది. గతంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సహాయకులు, వీఆర్వోలు ఉండేవారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి వివిధ పథకాల అమలు సమాచార సేకరణ.. గ్రామాల్లో సాంఘీక, ఆర్థిక, సామాజిక అంశాలలో వివరాలు సేకరించి రెవెన్యూశాఖకు అందించేవారు. కానీ గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్వోలను రద్దు చేయడంతో పనుల భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపై పడింది.

విధుల భారం.. నిధుల లేమి..

గ్రామ పంచాయతీలలో ఏ పని చేయాలన్నా నిధులు ఉండాలి. కానీ గత ఆరు నెలలుగా గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావటం లేదు. 2024 జనవరి నెలలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోయాయి. కానీ.. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యాలను నిర్దేశించి సమయంలో చేయాలని ఒత్తిడి చేయడంతో కార్యదర్శులు ఇటు ఆర్థిక భారంతో పాటు ఒత్తిడి గురై ఇబ్బందులు పడుతున్నారు.

ఇతర శాఖల పనులూ చేయాల్సిందే..

పంచాయతీ కార్యదర్శులు తమ శాఖ రోజువారి పనులతో పాటు ఇతర శాఖలకు చెందిన పనులు కూడా చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం మిషన్ భగీరథకు సంబంధించిన సర్వేలు చేస్తున్నారు. అదే విధంగా మరుగుదొడ్ల సర్వే, వ్యవసాయశాఖకు సంబంధించిన సర్వేలను కార్యదర్శులు మెడకు చుట్టారు. వీటితో పాటు విద్యాశాఖకు సంబదించిన మరికొన్ని పనులు అప్పగించారు. ఇప్పటికే పాఠశాలలో మౌళిక వసతుల కల్పన, పరిశుభ్రత తదితర పనులు నిర్వహించాల్సి వస్తుంది. ఇదివరకు గ్రామాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు సంబంధించిన విచారణ బాధ్యతలు వీఆర్‌వోలు చేపట్టేవారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ లేకపోవటంతో ఈ బాధ్యతలు కూడా పంచాయతీ కార్యదర్శులపై మోపారు. గ్రామాల్లో జరిగిన వివాహాలను రిజిస్టర్ చేయటం, సంబంధించి ధ్రువపత్రాలు జారీ చేయటం వావాహం జరిగిన గ్రామం, ప్రదేశం తదితర అంశాలను విచారణ చేసి ధ్రువీకరించటం ఇలాంటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

భారం తగ్గించండి..

పనుల భారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ సంబంధించి తాము అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నామని, ఇతర శాఖలకు సంబంధించిన పనులు కూడా చేయాలని ఒత్తిడి చేయడం భావ్యం కాదని కార్యదర్శులు వాపోతున్నారు. తమ శాఖలో పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ ఏ ఇతర శాఖ కూడా తమకు సహాయం చేయటం లేదని పేర్కొంటున్నారు.

ఆందోళనలో పంచాయతీ కార్యదర్శులు

వేంసూరు: గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలన మొదలు నుంచి ఇప్పటి వరకు నిధులు రాక కార్యదర్శులు వారి జీతంతో పాటుగా అప్పుల చేసి మరీ పనులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం బదిలీలపై బ్యాన్ తీసివేయనప్పటికీ జిల్లాలో మాత్రం బదిలీలు నిర్వహిస్తామని వివరాలు సేకరించడంతో పంచాయతీ కార్యదర్శులు ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా స్టేట్ ఫండ్(ఎస్‌ఎఫ్‌సీ పెనాన్స్) నిలుపుదల చేయడం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్ర నిధులు మంజూరు చేయకపోవడంతో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ పూడికతీత, నీటి సరఫరాకు సంబంధించిన రిపేర్లు, మోటర్ రిపేర్లు, ట్రాక్టర్ ఆయిల్, రిపేర్లు, వీధి దీపాల నిర్వాహణ, కొత్త వీధి దీపాల ఏర్పాటు, వంటి అనేక పనులకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అప్పులు చేసి మరి పనులు చేశామని పంచాయితీ కార్యదర్శులు గోడు వెళ్ళబుస్తున్నారు. పెద్ద పంచాయతీలకు సుమారు రూ.7 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశామని బదిలీలు జరిగితే తాము అప్పులు చేసి నిర్వహించిన పనులకు డబ్బులు వస్తాయా.. లేదా? అని ఆవేదన చెందుతున్నారు.

అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఎర్రుపాలెం: అర్హులందరికీ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని డీసీసీబీ డైరెక్టర్, తక్కెళ్లపాడు సొసైటీ చైర్మన్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి కోరారు. గురువారం మండలంలోని మీనవోలు, తక్కెళ్లపాడు, పెద్దగోపవరం ములుగుమాడు రైతు వేదిక కార్యాలయాల్లో నిర్వహించిన రైతు మహాజన సమావేశాల్లో సొసైటీ చైర్మన్లు అయిలూరి వెంకటేశ్వరెడ్డి, కుడుముల మధుసూధన్‌రెడ్డి, శీలం అక్కిరెడ్డి, శెట్టిపల్లి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. రైతు భరోసా పథకం వర్తింపు చేయాల్సిన తీరు తెన్నులపై పలు రకాల సూచనలు చేశారు. రైతాంగం చేసిన సూచనలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు కోఆపరేటివ్ సొసైటీల డిప్యూటీ రిజిస్ట్రార్ మాలోత్ వాల్యా నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి కె..విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఈఓలు రాంబాబు, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఈఓలు బాలకృష్ణ, కృష్ణకుమారి, దుర్గాప్రసన్న, సొసైటీ డైరక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిలిపివేయాలి..

బోనకల్: మండలంలోని కలకోట, పెద్దబీరవల్లి, మోటమర్రి సహకార సంఘాలలో రైతు మహాజన సభ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగులో లేని భూములకు రైతుభరోసా నిలిపివేయాలని అధికారులకు తెలపారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సరిత, సహకార సంఘం అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బోజెడ్ల పుల్లారావు, జిల్లా సహకార సంఘం అధికారి ప్రత్యానాయక్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సుధాకర్



సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

సత్తుపల్లి: సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాదిరాజు సుధాకర్(ఆంధ్రజ్యోతి), నర్రా అరుణ్‌కుమార్(సాక్షి టీవి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా ఎం.డీ.షైబుద్దీన్(సాక్షి), రామిశెట్టి లక్ష్మణ్‌రావు(మన తెలంగాణ), భీమిశెట్టి రాము(నమస్తే తెలంగాణ), సీహెచ్.బాలకృష్ణ(నవ తెలంగాణ), గౌరవ సలహాదారులుగా తోట కిరణ్(వెలుగు), తడికమళ్ల దేవదానం(మనం), రేగళ్ల విజయభాస్కర్‌రెడ్డి(నవ భూమి) ఎన్నికయ్యారు. అంతేకాకుండా కోశాధికారులుగా నరుకుళ్ల రాము(టీవీ 5), కాకర్ల జగన్ (జనం సాక్షి), ఉపాధ్యక్షులుగా జీడిమళ్ల శ్రీనివాస రావు(సాక్షి), బొల్లెపోగు సురేష్(ప్రైమ్ 9), బేతి ఆనంద్(బీఆర్‌కే న్యూస్), ప్రచార కార్యదర్శులుగా కొత్తపల్లి సుధాకర్(దిశ), మారోజు అశోక్(పీటీవీ), సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ రఫీ(జై తెలంగాణ), ఎస్.కే.మీరా(ఎన్ టీవీ), నల్లంటి మోహన్ (రాజ్‌న్యూస్)తో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సాంబశివరావు, సింగపోగు శివ, బండారు ఉమామహేశ్వరరావు, ఒబిలిశెట్టి రామారావు, బాజీ, ఎం.ఏ.మెహరాజ్, ఐ.రాంకీ, జమ్ముల రాజేష్‌రెడ్డి, చీకటి గోపి, ఆర్‌వీఆర్, ఎం.డీ.ఫజల్, పి.లక్ష్మణ్‌రావు, గోదా విష్ణు, జల్లిపల్లి శ్రీనివాసరావు, లంకా రాజేష్, యనమాల విజయ్, బండి వేలాద్రి, బల్లెం చిరంజీవి పాల్గొనగా, నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తదితరులు అభినందించారు.

ఉన్నత లక్ష్యాలు సాధించండి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి
- ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి సత్కారం



సత్తుపల్లిటౌన్: విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులను సత్తుపల్లి క్యాంప్ కార్యాలయంలో సత్కరించి నగదు బహుమతులను అందించారు. నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు తేజ, అభినయశ్రీ, కోటేశ్వరి, భవిష్, ఐషత్ సుమయలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.రాములు, హెచ్‌ఎంలు నక్కా రాజేశ్వరరావు, శ్రీను, పద్మజ, జోసెఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమవరం గ్రామానికి చెందిన ఆరోప్ తస్లీమ్..



విద్యార్థిని అభినందిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్.బహదూర్ కుమార్తె షేక్.ఆరోప్ తస్లీమ్ అత్యుత్తమ మార్కులు సాధించి బాసరలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించింది. దీంతో ఆమెను బీఆర్‌ఎస్ నాయకులు లోకేశ్వరరావు, శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకుడు రమేష్‌లు శాలువాలతో సత్కరించారు.

ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవం



పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కారేపల్లి: వనమహోత్సవం సందర్భంగా.. మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో గురువారం మొక్కలు నాటారు. సమీప సీతారాంపురం గ్రామంలోని నర్సరీ నుంచి సుమారు 69 రకాల పండ్ల, పూల మొక్కలను తీసుకొచ్చి.. పాఠశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బానోత్ నామానాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సోమ్లానాయక్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కాలువను సందర్శించిన రైతులు



సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్‌ను సందర్శిస్తున్న తల్లాడ రైతులు

తల్లాడ: సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాలువను తల్లాడ మండల రైతులతో పాటు ఏన్కూరు, రేపల్లెవాడ, హిమాంనగర్ గ్రామాల్లోని రైతులు సీతారామ ప్రాజెక్ట్ పనులను గురువారం పరిశీలించారు. వచ్చే నెలతో పనులు పూర్తి అవుతున్నందున్న రైతులు హర్షం వ్యక్తం చూసి.. మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌రావు, వీరారెడ్డి, బుద్ధిసాగర్, కృష్ణారెడ్డి, ప్రభాకర్, రాము, రమేష్ మల్లిఖార్జున్‌రావు, జోసఫ్, నాగన్న, రామప్పారావు, లచ్చిరెడ్డి, ప్రసాద్, వేణు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య వర్ధంతి



వైరాలో దొడ్డి కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



సత్తుపల్లిరూరల్: దొడ్డి కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుబల్లిలో..

వైరా/ పెనుబల్లి/ సత్తుపల్లిరూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని వైరాలో, పెనుబల్లి మండలంలోని రామచందర్‌రావుబంజర్‌లో, నిర్వహించిన సమావేశంలో, సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ.. అమరుడైన కొమరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో నాయకులు రామారావు, శ్రీనివాసరావు, సుధాకర్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, ప్రసాద్, కృష్ణవేణి, రమణారెడ్డి, నాగరాజు, ప్రేమ్, కృష్ణమూర్తి, రాంబాబు, వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, నాగేశ్వరరావు, శివ, చెన్నారావు, మురళీ, నరసింహారావు, రాములు, వెంకటేశ్వరరావు, సత్తుపల్లి మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, జ్యోతి, రమణ, వెంకట్రావమ్మ, కృష్ణ, శ్యామల, ధనమ్మ, సైదమ్మ, రాము పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లోని సాయినాధుడికి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు సాయి గీతాలను ఆలపించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

కారేపల్లి: మండలంలోని వేకలతండా గ్రామంలో తోటకూడరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు తోటకూరి పిచ్చయ్య గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులకు మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే రూ.10లక్షలతో పలుగ్రామాల్లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పుల్లాచారి, మత్రు, శంకర్, శ్రీరాములు, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శరత్, పాపారావు, సరోజిని, లక్ష్మీ, రమేష్, నాగమణి, నరేందర్ పాల్గొన్నారు.

పరామర్శ..

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన కోఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి గంగుల పుల్లయ్య ఇటీవల మృతి చెందగా.. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం ఆ కుటుంబాన్ని సందర్శించి పుల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, రామకృష్ణ, కృష్ణ, కమ్లి, ప్రసాద్, నాగేశ్వరరావు, రాంబాబు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సయ్యద్ రవూఫ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో గల శ్రీ విశ్వధర్మక్షేత్రంలో మాస శివరాత్రి పర్వదినోత్సవం పురస్కరించుకొని శ్రీఅన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, శ్రీవిశ్వధర్మక్షేత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెల్లటూరి ప్రసాదాచారి పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల మాస శివరాత్రి రోజున స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ

కొణిజర్ల: విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ కమలప్రియ అన్నారు. గురువారం కొణిజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. పూర్వ ప్రాథమిక విద్యా దీపిక.. పూర్వ ప్రాథమిక వాచకాల గురించి వివరించారు. మాస్టర్ ట్రైనీ షేక్.షాకీరా శిక్షణ ఇచ్చారు. అనంతరం మండలంలోని దిద్దుపూడి గ్రామంలో 5 ఏళ్ల లోపు బాల బాలికల బరువుల మేళా కార్యక్రమం నిర్వహించి గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఉషారాణి, పోషణ అభయాన్ కోఆర్డినేటర్ షామిలి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గీతాబాయి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కందిపప్పు, పాలు అందించాలి

కల్లూరురూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గత 20 రోజులుగా పాలు, కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులు, ఈ కేంద్రాల లబ్ధిదారులైన బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందని పరిస్థితి నెలకొంది. దీంతో పిల్లలకు కూరగాయలతోనే సరిపెడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు పాలు, కందిపప్పు, కురుకురేలు సరఫరా చేయాలని బాలింతలు, గర్భిణులు కోరుతున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నీట్ పరీక్షకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. నీట్ విద్యార్థులకు న్యాయం జరగకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సంస్థను తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్‌తో కేంద్ర ప్రభుత్వం ఆటలు ఆడుకుంటుందని ఆరోపించారు. ఈ సమస్యపై బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

– సాక్షినెట్‌వర్క్



వైరా: తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు



మధిరలో బంద్ చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



సత్తుపల్లిటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘల నాయకులు



బోనకల్: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



చింతకాని: ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



పెనుబల్లిలో..



వేంసూరు: చౌడవరంలో..



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో.. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు



కొణిజర్ల: మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



ముదిగొండ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు